

సాక్షి
బాపట్ల
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



7713 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధి కిటకిట

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అండర్-19 క్రీడా జట్ల ఎంపికలు



సత్తెనపల్లి: జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈ నెల 24న అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అండర్-19 బాలబాలికల రెజ్లింగ్ క్రీడా ఎంపికలు, గుంటూరు సమీపంలోని గోరంట్లలో గల నెక్స్‌ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 28న బాపట్లలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో త్రోబాల్ క్రీడా ఎంపికలు, చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఆయా క్రీడా ఎంపికలో పాల్గొనే విద్యార్థులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారై ఉండాలని, కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేసిన మార్కుల జిరాక్స్ కాపీని తప్పనిసరిగా క్రీడా ఎంపికలకు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు..

కొండవీడుకు పర్యాటకుల అనుమతి



నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కొండవీడుకు పర్యాటకులను ఆదివారం నుంచి అనుమతించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు పర్యాటకుల రాకపోకలు నిలిపివేశారు. అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఘాట్‌రోడ్డుపై పడిన కొండరాళ్లను తొలగించి రహదారికి మరమ్మతులు చేశారు. ఆదివారం ఉదయం తనిఖీల అనంతరం రాకపోకలకు అనుమతించారు. రెండు వారాల నుంచి రాకపోకలు నిలిపివేయడంతో ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. కొండపై ఏర్పాటు చేసిన నగరవనంలో పర్యాటకుల సందడి నెలకొంది.

బంగారు తాపడం పనులకు రూ. 1.01 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం విరాళాన్ని అందజేశారు. గుంటూరు సంగడిగుంటకు చెందిన పీరం శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈవో కె.ఎస్.రామరావును కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

జెడ్పీ సీఈవోగా జ్యోతిబసు నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈవోగా వి.జ్యోతిబసు నియమితులయ్యారు. డెప్యూటీ సీఈవో బాధ్యతలు నిర్వర్తిస్తున్న జె.మోహనరావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా డ్వామా ఏపీడీగా పని చేస్తున్న సీహెచ్. కృష్ణను నియమిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 589.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,350, ఎడమ కాలువకు 2,818, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,623, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 58,024 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పచ్చ ఇసుకాసురుడు

- చీరాలలో ఆగని ఇసుక దందా
- పచ్చపార్టీ నేత తనయుడి అక్రమ వ్యాపారం
- వరద కాలువలో విచ్చలవిడిగా తవ్వకాలు
- ఈపూరుపాలెం, వేటపాలెం స్ట్రయిట్ కట్ నుంచి అక్రమ రవాణా
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల నుంచి తవ్వకాలు
- అపార్ట్‌మెంట్లు, వెంచర్లు, బిల్డర్లకు ఇసుక సరఫరా
- ట్రాక్టర్ రూ.5,500
- రాత్రిపూట 50 ట్రాక్టర్లతో తరలింపు
- హైదరాబాద్ బ్యాచ్‌ను పెట్టి దందా
- కరకట్ట తవ్వకాలతో ముంపు ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



వేటపాలెం- ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వరద కాలువ నుంచి ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో కొందరు పచ్చ పార్టీ నేతలు ధనార్జనే ధ్యేయంగా పలు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇసుక, బుసక, మట్టి, గ్రావెల్ సహా ఏది దొరికితే దాన్ని అమ్ముకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. తాజాగా చీరాల ప్రాంతానికి చెందిన పచ్చ పార్టీ నేత కన్ను చీరాల ప్రాంతంలో మురుగు, వరద నీటిని సముద్రానికి తరలించే వరద కాలువ (ఈపూరుపాలెం,వేటపాలెం స్ట్రయిట్ కట్) మీద పడింది. ఇసుకతో కూడిన వరద కాలువ కరకట్టలను తవ్వేసి క్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. రాత్రి 11:30 నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు దందా నడుస్తోంది. జేసీబీలు పెట్టి తవ్వి రోజుకు 50 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడి ఇసుకను చీరాల ప్రాంతంలోని బిల్డర్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, రియల్ వెంచర్లు, ఇతర అవసరాలకు సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్‌ను రూ. 5,500 కు అమ్ముతున్నారు. స్ట్రయిట్ కట్ వరద కాలువలు సాగునీటి వనరుల శాఖ పరిధిలో ఉన్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి.

కరకట్టల ఇసుక తరలింపుతో ముప్పు

రొంపేరు నుంచి సముద్ర తీరం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఈపూరుపాలెం, వేటపాలెం ప్రాంతాల మీదుగా మురుగు, వరద కాలువ (రొంపేరు స్ట్రయిట్ కట్)లు నిర్మించారు . పంట పొలాలు, వంకలు, వాగుల నుంచి వచ్చే మురుగు, వరద నీరు స్ట్రయిట్ కట్ ద్వారా సముద్రంలో కలపడం కాలువ ఉద్దేశం. పచ్చపార్టీ నేత ఈ కరకట్టల ఇసుకను కొల్లగొట్టడం వల్ల కాలువగట్లు పూర్తిగా దెబ్బతిని చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని పలు గ్రామాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

వైఎస్ హయాంలో కాలువ ఆధునీకరణ

వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పూడికతో నిండి పోయిన స్ట్రయిట్ కట్ ఆధునీకరణకు నిధులు కేటాయించారు. ప్రధానంగా కాలువలో పూడికతీసి ఇరువైపులా కరకట్టలను బలోపేతం చేశారు. దీంతో వచ్చిన మురుగు, వరద నీరు నేరుగా సముద్రంలో కలిసేది. దీనివల్ల తీరంలోని గ్రామాలకు ముంపు తప్పేది.

ఎత్తిపోతల పథకాలకు నష్టం

స్ట్రయిట్ కట్ పరిధిలో రామన్నపేట, బచ్చులవారిపాలెం గ్రామాల సమీపంలో రెండు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి పలు గ్రామాల పరిధిలో పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. కాలువ కరకట్టల ఇసుక కొల్లగొట్టడంవల్ల వరదనీరు బయటకు పోయి ఎత్తిపోతల పథకాలకు నీరందే పరిస్థితి ఉండదు. దీంతో ఆ ప్రాంతం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. అయినా అధికార పార్టీ నేత తనయుడు ఏమాత్రం ఖాతరు చేయక కరకట్టలను తవ్వేసి, ఇసుకను అక్రమంగా తరలించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి అక్రమ ఇసుక తరలింపును అడ్డుకొని వరద కాలువలను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వేటపాలెం స్ట్రయిట్ కట్ ప్రధాన కాలువ

అధికారులపైనా ఒత్తిడి

పచ్చపార్టీ నేత తనయుడి ఒత్తిళ్లతోనే అధికారులు అక్రమ రవాణాను అడ్డుకోకుండా మిన్నకుండి పోయినట్లు తెలుస్తోంది. ఇసుక దందా వ్యవహారాన్ని అతడు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి అప్పగించినట్లు చీరాలకు చెందిన కొందరు అధికార పార్టీ నేతలు పేర్కొంటున్నారు. హైదరాబాద్ బ్యాచ్ దగ్గరుండి కరకట్టల ఇసుకతోపాటు ప్రభుత్వ భూములలోని ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకుంటోంది. ప్రధానంగా ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్‌లో ఈపూరుపాలెం, పాతచీరాల, బోయినవారిపాలెం, గవినివారిపాలెం, ఓడరేవు, కీర్తివారిపాలెం, వేటపాలెం స్ట్రయిట్ కట్ పరిధిలో పందిళ్లపల్లి, వేటపాలెం తదితర గ్రామాల పరిధిలోని కరకట్టనుంచి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో పాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూముల నుంచి పచ్చపార్టీ నేత ఇసుకను తరలించి అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. వేటపాలెం పరిధిలో పందిళ్లపల్లి, దేశాయిపేట, రామన్నపేట నాగవరపమ్మ గుడి ప్రాంతాలలోని అసైన్డ్ భూముల నుంచి ట్రిప్పర్ల ద్వారా రాత్రిపూట ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.



రాత్రిపూట చీరాలకు ఇసుక తరలింపు

జిల్లా రిజిస్ట్రేషన్ సిబ్బందికి ముగిసిన కౌన్సెలింగ్

- బాపట్ల ఎస్‌ఆర్వోగా జాన్ మోహన్‌కుమార్ నియామకం
- గుంటూరు-1 ఎస్‌ఆర్వోగా షరీఫ్ బాబు



పోస్టింగ్‌ల కోసం డీఐజీ కార్యాలయం ముందు వేచి చూస్తున్న సిబ్బంది

గుంటూరు వెస్ట్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం స్థానిక జెడ్పీ ఆవరణలోని డీఐజీ కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది కౌన్సెలింగ్‌కు వచ్చారు. కమిటీ చైర్మన్, గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు, నెల్లూరు డీఐజీలు పుష్పలత, కిరణ్ కుమార్ బదిలీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 70 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కలిగింది. దీనిలో భాగంగా గుంటూరు జాయింట్-1 ఎస్‌ఆర్వోగా మంగళగిరిలో పనిచేస్తున్న షరీఫ్ బాబు, జాయింట్-2గా నరసరావుపేటలో పనిచేస్తున్న వెంకటరావును బదిలీ చేశారు. కొరిటెపాడు ఎస్‌ఆర్వోగా పెదకూరపాడులో పనిచేస్తున్న వెంకటేశ్వరరావును, క్రోసూరులో పనిచేస్తున్న భాస్కర్‌ను పెదకాకానికి, ప్రత్తిపాడుకు పి.శ్రీనివాసరావును, తాడికొండకు రమాదేవి, బాపట్లకు జాన్‌మోహన్‌కుమార్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నల్లపాడు ఎస్‌ఆర్వోగా పనిచేస్తున్న గోపాల్‌ను అక్కడే ఉంచారు. దీంతోపాటు సుమారు 400 మంది సిబ్బందిని కౌన్సెలింగ్ ద్వారా వివిధ స్థానాలకు బదిలీ చేశారు. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్న వారికి అధిక ప్రాధాన్యం దక్కినట్లు సమాచారం.

పక్కాగా వరద బాధితుల సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ జె. వెంకట మురళి

బాపట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద విపత్తునకు జల దిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలన్నింటినీ పక్కాగా సర్వే చేశామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. వరద విపత్తునకు గురైన ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియా ఆదివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో జరిగిన నష్టం, పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వద్ద అర్హుల జాబితా నోటీసు బోర్డులో ప్రచురించాలని సూచించారు. సర్వేలో నమోదు కాని వారు సమస్యలపై ఫిర్యాదు చేసుకోవడానికి సచివాలయంలో లాగిన్ ఇస్తామని చీఫ్ సెక్రటరీ చెప్పారు.

24 లంక గ్రామాల ప్రజలకు నష్టం

కృష్ణానది పరీవాహక ప్రాంతమైన బాపట్ల జిల్లాలోని 24 లంక గ్రామాల ప్రజలకు పూర్తిగా నష్టం వాటిల్లిందని సిసోడియాకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి వివరించారు. ఆ గ్రామాలన్నీ జల దిగ్బంధంలో ఉన్నప్పుడు సత్వరం సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి పక్కాగా నష్టాన్ని సర్వే చేస్తున్నాయని చెప్పారు. 499 మంది ఈకేవైసీ ప్రక్రియ మిగిలిపోయిందన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో 200 మంది వివరాలు సర్వే యాప్‌లోనే సూపర్‌వైజర్ లాగిన్‌లో ఉండిపోయాయని చెప్పారు. మరో 250 మంది వివరాలకు సర్వే చేసినా వారి ఐడీ నంబర్ చూపడం లేదని తెలిపారు. చిన్న చిన్న సమస్యలు 490 తలెత్తాయని, వాటి పరిష్కారానికి అనుమతి ఇవ్వాలని కలెక్టర్ కోరారు. వరద నష్టపరిహారానికి అర్హులైన వారి జాబితా సచివాలయాల వద్ద ప్రకటిస్తామని, సామాజిక తనిఖీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమస్యలపై లంక గ్రామాలలోని ప్రజలు ఫిర్యాదులు చేసుకోవడానికి సచివాలయాలకు లాగిన్ కేటాయించాలని కలెక్టర్ కోరారు. ప్రజలు ఎవరైనా ఆన్‌లైన్‌లో పేర్లు చూసుకోవడానికి పబ్లిక్ డొమైన్ లో వివరాలను నిక్షిప్తం చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జల వనరులు, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు మల్లికార్జున, రామకృష్ణ,, సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలే ఏసుబాబు హత్యకు కారణం

- డీఎస్పీ రామాంజనేయులు
- హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు చంద్రశేఖర్ అరెస్టు చూపుతున్న డీఎస్పీ

బాపట్ల: సూర్యలంక సముద్ర తీర ప్రాంతం వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు వివరాలు వెల్లడించారు. కృష్ణాజిల్లా పెద్దప్రోలు చెందిన ఏసుబాబు కొన్ని సంవత్సరాల నుంచి బాపట్లలో నివసిస్తూ, పరిసర ప్రాంతాల్లో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల మండలం సూర్యలంక రహదారిలోని ఆదర్శనగర్‌కు చెందిన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను నెలకు రూ. పది వేలు ఇచ్చి అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో నిందితుడు కొంతమందికి అప్పుకు డబ్బులు ఇప్పించాడు. సదరు వ్యక్తులు తిరిగి చెల్లించకపోవడంతో మృతుడు ఏసుబాబు (40) చంద్రశేఖర్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఏసుబాబును ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న చంద్రశేఖర్ పథకం ప్రకారం డబ్బులు ఇస్తానని అతడ్ని పిలిపించాడు. సూర్యలంక రహదారిలోని చప్టా వద్ద కోడికత్తితో మెడ కుడి వైపు పొడవడంతో ఏసుబాబు ప్రాణాలు కాపాడుకోవడానికి ద్విచక్ర వాహనంపై సూర్యలంక వెళ్లి షాపుల వద్ద పడిపోయాడు. స్నేహితుడైన గోవర్ధన్‌కు చంద్రశేఖర్ అలియాస్ (చిన్ను) తనను కోడి కత్తితో పొడిచాడని చెప్పి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ సీఐ గంగాధర్ అన్ని కోణాలలో కేసు విచారణ చేపట్టి నిందితుడైన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను సూర్యలంక రహదారిలోని పందెం కోడి రెస్టారెంట్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. విచారణలో నిందితుడు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఏర్పడిన వివాదంలో తానే కోడికత్తితో పొడిచి హత్య చేశానని ఒప్పుకున్నాడని వివరించారు. కేసులో కీలకంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

ప్రకృతికి ప్రణామం



బెల్లంకొండ మండలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం, సిబ్బంది

ప్రకృతి సేద్యం ఫలిస్తోంది

- జిల్లావ్యాప్తంగా విస్తరిస్తున్న సాగు
- సేద్యానికి ముందుకొస్తున్న యువ, మహిళా రైతులు
- 42 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 39,113 మంది రైతులు
- తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర పంటలంటున్న రైతులు
- భూసార పరిరక్షణకు ప్రకృతి సేద్యం వైపు మొగ్గాలంటున్న వ్యవసాయాధికారులు

బెల్లంకొండ: రసాయన ఎరువులు, పురుగు మందులను పక్కన పెట్టి కషాయాలు, సేంద్రియ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందడంతో పాటుగా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించేందుకు ముందుకు వస్తున్నారు. నాణ్యమైన, బలవర్ధకమైన పంటలు పండిస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో తాము సాధించిన విజయాలను నలుగురికి పంచుతూ... ఆ నలుగురు మరో నలభై మందికి...ఇలా జిల్లావ్యాప్తంగా నేడు వేల సంఖ్యలో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు వైపు పయనిస్తున్నారు.

రసాయనాల నుంచి కషాయాల వైపు..

మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నానాటికి అనర్థాలు అధికమవుతున్నాయి. మట్టిలో సత్తువ తగ్గి, సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు అంతరించిపోతున్నాయి. ఖర్చు పెరుగుతూ, గిట్టుబాటు దక్కక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల అందించడమే కాక.. ఇటు అధిక ఆదాయం పొందేలా.. ప్రకృతి సాగుదిశగా జిల్లా అధికార యంత్రాంగం కొన్నేళ్లుగా రైతులను మళ్లిస్తోంది.

పాత రోజుల్లో వలే..

ఏపీ కమ్యూనిటీ మేనేజ్మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పూర్వ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. పంటలకు రసాయన ఎరువుల స్థానంలో జీవామృతం, వేప గింజల కషాయం, బ్రహ్మాస్త్రం వంటి రకరకాల కషాయాలు పంటలపై పిచికారీ చేసి నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తూ వ్యవసాయంలో బంగారు బాటలు వేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కూడా వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులే స్వయంగా పంటలు పండించే చోటుకు వెళ్లి మరీ ఉత్పత్తులను కొనుగోలు చేసుకుంటున్నారు.

విత్తు నుంచి పంటవరకు..

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధికారులు, సిబ్బంది అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారు. విత్తు వేసే దగ్గరనుంచి పంట చేతికి అందేవరకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ద్రవ, ఘనజీవామృతాలు, చీడపీడల నివారణకు కషాయాల తయారీ వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యక్షంగా చేసి చూపించడంతో పాటు వారితో తయారు చేయిస్తున్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం...

ప్రధాన పంట వరితో పాటుగా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా గట్ల పైన చిక్కుడు, బీర, కాకర, మునగ, అరటి, బెండ తదితర కూరగాయలు, కంది, బంతి వంటి వాటిని వేయడానికి ప్రోత్సహిస్తున్నారు. కేవలం అంతర పంటల వల్లే రైతులకు గట్ల పరిమాణం బట్టి ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు లాభం వస్తుంది. జిల్లాలో రైతులు 186 మంది వరకూ ఏ-గ్రేడ్ మోడల్స్‌లలో అంతర పంటల సేద్యం చేస్తున్నారు.

ఎనీ టైం మనీ వచ్చేలా ప్రదర్శన క్షేత్రాలు

మొత్తం 27 రకాల పంటలు, కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి, నూనెజాతి, పూలరకాలు, వివిధ రకాల పంటలను ఒకే పొలంలో వేసి నిరంతరంగా 365 రోజులు కూడా ఆదాయాన్ని ఇచ్చే విధానాన్ని ఏటీఎం మోడల్‌గా పరిచయం చేశారు. ఈ విధంగా పలు పంటల వేయడం వలన జీవవైవిధ్యం బాగా పెరిగి, అధిక దిగుబడి వస్తుంది. 20 సెంట్ల భూమి ఉన్న ప్రతి రైతుకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు వంటివి అందిస్తూ... ఏటీఎం మోడల్ నిరంతర ఆదాయం వచ్చేలా జిల్లాలో 28 ప్రదర్శన క్షేత్రాల వరకూ రైతులు సాగు చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుతం రసాయనాల ద్వారా సాగు చేస్తున్న పంటల్లో మనిషికి కావాల్సిన రోజువారీ పోషకాలు తగ్గిపోయాయి. పురుగు మందులు, ఎరువులు రేట్లు బాగా పెరగడంతో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటను పండించుకోవచ్చు. నిరంతరం ఆదాయం వచ్చే విధంగా ఏటీఎం మోడల్స్ వేసుకోవాలి. ప్రతి రైతు సేవా కేంద్ర పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. క్రమంగా సాగు విస్తీర్ణం పెంచుకుంటూ అధిక శాతం ఈ విధానంలో సాగు చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

– అమలకుమారి,
జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి, పల్నాడు

పల్నాడు జిల్లావ్యాప్తంగా...



బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతు అనంతలక్ష్మి పండిస్తున్న వరిపైరు

జిల్లాలో మొత్తం 39,113 మంది రైతులు 42,312 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులు అవలంబిస్తున్నారు. వీరిలో పత్తి పంటలో 15,452 మంది రైతులు 17,630 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు. వరి పంటలో 10,774 మంది రైతులు 11,704 ఎకరాల విస్తీర్ణంలో, మిరప పంటలో 12,887 మంది రైతులు 12,976 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారు. జిల్లాలో వ్యాప్తంగా ఎటువంటి రసాయనాలు వాడకుండా పూర్తి స్థాయిలో 13,265 మంది రైతులు 14,733 ఎకరాలు విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 28 నిరంతరం ఆదాయం ఇచ్చే ఏటీఎం మోడల్స్ ఉన్నాయి. అంతర పంటలు సాగు చేస్తున్న 186 ఏ-గ్రేడ్ మోడల్స్ ఉన్నాయి.

క్లుప్తంగా

బస్టాండ్‌లో మందుబాబు వీరంగం

అద్దంకి రూరల్: పూటుగా మద్యం తాగి ఓ వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్‌లో వీరంగం సృష్టించాడు. ఆదివారం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులను, ఆర్టీసీ ఉద్యోగులనుపై దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడాడు. డిపో సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన దాసరి చినమస్తాన్ చీమకుర్తిలో నివాసం ఉంటున్నాడు. బంధువుల దిన కార్యక్రమాలకు వెళ్లడానికి ఒంగోలు నుంచి నరసరావుపేట వెళ్లే బస్సులో ఎక్కి అద్దంకిలో దిగాడు. ఈ క్రమంలో బస్సు లేటయిందని నరసరావుపేట బస్సు డ్రైవర్, కండక్టర్‌పైనా దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడు. ఇదేంటని ప్రయాణికులు వారించటంతో వారిపై కూడా చేయి చేసుకున్నాడు. తాను లారీ డ్రైవర్‌నని, మార్కాపురం, త్రిపురాంతకం, దొనకొండ ప్రాంతాల్లో పలు మర్డర్ కేసులు ఉన్నాయని, తన జోలికి వస్తే ఎమైనా చేస్తానని బెదిరించసాగాడు. ఈ క్రమంలో డిపో సెక్యూరిటీ అక్కడకు చేరకుని పట్టుకోవడానికి ప్రయత్నించగా రోడ్డు మీదకు పరారయ్యాడు. అయినా వదలకుండా వెంట బైకుమీద వెళ్లి పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం



తెనాలి అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బోసు రోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కోరుకున్న మంచి పాలనను వంద రోజుల్లో అందించినట్లు చెప్పారు. తెనాలి ప్రాంతంలో 80 శాతం గంజాయి నిర్మూలించామని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నాయకులు పసుపులేటి మురళీకృష్ణ, బండారు మురళీకాంత్, జిడుగు తులసి, ఇస్మాయిల్ బేగ్, హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, దంతాల కిరణ్‌కుమార్, షేక్ జాకీర్ హుస్సేన్, దివ్వెల మధుబాబు, చెట్టుపల్లి శ్రీనివాసరావు, బెల్లపు యశ్వంత్, జెట్టి గుణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్లు సరళ విధానంలో ఇవ్వాలి

కొరిటిపాడు(గుంటూరు): ఏటా లైవ్ సర్టిఫికెట్ పద్ధతి కాకుండా డిజిటలైజేషన్ ద్వారా సరళ విధానంలో తమకు పెన్షన్లు అందించాలని పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు యు.వెంకట్రావు కోరారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జీటీ రోడ్డులోని రైతు భవన్‌లో ఆదివారం నిర్వహించారు. 75 ఏళ్లు వయస్సు నిండిన సభ్యులు నన్నపనేని అమర్నాథ్, స్థాపకులను సత్కరించారు. వెంకట్రావు మాట్లాడుతూ బోర్డులో సుదీర్ఘకాలం పనిచేసి రైతులకు ఎన్నో సేవలను వీరిద్దరూ అందించారని ప్రశంసించారు. బోర్డు స్థాపనకు, వేలం విధానం రావటానికి కృషి చేసిన కొత్త రఘురామయ్య, బీవీ శివయ్య, ఎంసీ మహాపాత్ర, ఇతర రైతు నాయకుల కృషిని ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు గుర్తు చేసుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బీఎస్ మిత్ర, సభ్యులు పాల్గొన్నారు.

పెచ్చరిల్లుతున్న కూటమి అరాచకాలు

- మండిపడిన దళిత సంఘాల నాయకులు
- టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం
- దళిత డాక్టర్‌పై దాడిచేసిన జనసేన ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలని డిమాండ్
- ఇద్దరి ఎమ్మెల్యేలపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి



ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

చీరాల రూరల్: కూటమి ప్రభుత్వంలో రోజు రోజుకూ ఆయా పార్టీల ఎమ్మెల్యేలు అరాచకంగా ప్రవర్తిస్తున్నారని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్ ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు తీరును నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాచవరపు జూలియస్, దేవరపల్లి బాబూరావు, పులిపాటి బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కరన్నా, దళితులన్నా ఏ మాత్రం ఇష్టం ఉండడం లేదని తెలిపారు. దళితులపై భౌతిక దాడులకు పాల్పడుతూ కులం పేరుతో దూషిస్తూ అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగా తొలగించి అవమానించిన రఘురామ కృష్ణంరాజును ఎమ్మెల్యే పదవి నుంచి తక్షణమే తొలగించాలని కోరారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.

దళితులపై దాడులు, అరాచకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులపై దాడులు, అరాచకాలు పెచ్చుమీరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా ఎమ్మెల్యే అయిన రఘురామ కృష్ణంరాజు ఆయన ఫ్లెక్సీని జనసేన నాయకుల కేరింతల మధ్య స్వయంగా తొలగించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ కాకినాడలోని రంగరాజ మెడికల్ కాలేజీ వైద్యుడిపై దాడి చేయడమే కాకుండా బూతులు తిట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తక్షణమే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలగజేసుకుని అతడ్ని ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని కోరారు. అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. మళ్లీ ఎక్కడా ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంబేడ్కర్‌ను అవమానపరచే విధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును, దళిత డాక్టర్‌ను కొట్టి బూతులు తిట్టిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీలపై అట్రాసిటీ కేసులు నమోదుచేసి అరెస్టులు చేయాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు చీరాల ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో నాయకులు దార్ల శాస్త్రి, మల్లెల బుల్లిబాబు, కనపర్తి బుజ్జిబాబు, గోసాల అశోక్, బండ్లమూడి విజయకుమార్, మేరుగ రమేష్, పేర్లి బుజ్జిరాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో పోలీసుల తనిఖీలు



రిసార్ట్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

బాపట్ల: జిల్లా పరిధిలోని రెస్టారెంట్లు, దాబాలు, హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలకు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. జిల్లాలో శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీలు చేయించారు. ఎస్పీ అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు, నేరస్తులను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా మద్యం విక్రయాలతో పాటు అనుమతి లేని ప్రదేశాలలో తాగుత ఇతరులకు ఇబ్బందికరంగా వ్యవహరించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా వాటి నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. బస చేసే వ్యక్తుల పూర్తి వివరాల్ని రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. బస చేసిన వారి కదలికలపై అనుమానం తలెత్తినా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్నా సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

ఒకే ప్రాంతంలోని రెండు ఇళ్లలో దొంగతనాలు

భారీగా నగదు, బంగారు చోరీ

లక్ష్మీపురం: ఒకే ప్రాంతంలో శనివారం రెండు ఇళ్లల్లో భారీ చోరీలు జరిగాయి. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతంలో ఈ దొంగతనాలతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం ..... ఎస్‌వీఎన్ కాలనీ 4వ లైన్‌లో ఇంటి యజమాని మద్దు వెంకట శంకరరావు, మహాలక్ష్మి దంపతులు మధ్యాహ్నం బయటకు వెళ్లారు. ప్రధాన తలుపులు పగలగొట్టిన దుండగులు బీరువాలోని రూ.2 లక్షల నగదు, 520 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఎస్సై మధు పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌వీఎన్ కాలనీ 7వ లైన్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆర్‌టీసీ విశ్రాంత ఉద్యోగి కూచిబోట్ల సూర్యనారాయణ ఇంటి వెనుక భాగంలో కిటికీ గ్రిల్స్ పగలగొట్టిన దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 80 సవర్ల బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఆదివారం ఉదయం విషయం వెలుగుచూసింది. పట్టాభిపురం సీఐ వీరేంద్ర, ఎస్సై రాంబాబు, సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తామని అధ్యక్షులు లాల్ వజీర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో వజీర్ మాట్లాడారు. 14 జిల్లాలకు సంబంధించిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారని, ఆయా జిల్లాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలకు కూడా తాము సహకరిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ ఆధారంగా నేషనల్స్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీలక్ష్మి, మదిలేటి రెడ్డి, షేక్ నజీర్, ప్రభుదాస్, ఫ్లోరా, కొచ్చి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య

మంగళగిరి: ప్రేమ వ్యవహారమై తండ్రి మందలించాడని యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్న ఉడతా ఉపేంద్ర కుమారుడు నాగసాయి(22) ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రేమ వ్యవహారంలో తండ్రి మందలించడంతో బంధువుల నివాసానికి వెళ్లి విషం తీసుకుని ఆత్మహత్య చేసుకోగా సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్పు రైతులంతా ఐక్య పోరాటాలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉప్పు రైతులు, లైసెన్స్‌దారులు

- సమావేశంలో తీర్మానం
- త్వరలో లీజుల లైసెన్స్‌లు రద్దు
- ప్రమాదంలో పలు కుటుంబాలు

చినగంజాం: ఉప్పు ఉత్పత్తిదారుల భూమి లీజులు, లైసెన్స్‌లు రద్దు కావస్తున్న తరుణంలో వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులంతా ఐక్యంగా ఉండి పోరాడుదాం అని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పు రైతులు, లైసెన్స్‌దారుల సమావేశం స్థానిక భావన్నారాయణస్వామి కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి రైల్వే బోర్డు సలహాదారుడు వలివేటి విశ్వనాథబాబు అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా లీగల్ అండ్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్ జి. అన్నయ్యశర్మ పాల్గొన్నారు. ఉప్పు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథబాబు మాట్లాడుతూ చినగంజాం మండలంలో 2,400 ఎకరాలు 2027 తరువాత పూర్తిగా లైసెన్స్‌లు రద్దు కానున్న దృష్ట్యా రైతులు అప్రమత్తం కావాలని తెలిపారు. ఇందులో చినగంజాం సొసైటీ భూమి 400 ఎకరాలు, రాజుబంగారు పాలెం సొసైటీ భూమి 120 ఎకరాలు, సర్కార్ భూమి 70 ఎకరాలు, బీవీ రమణారెడ్డి 50 ఎకరాల లైసెన్స్‌లు ఈ పాటికే రద్దు అయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ రైతులు ఆ భూముల్లో స్టే తెచ్చుకోవడం ద్వారా సాగు కొనసాగిస్తున్నారని చెప్పారు. మిగిలిన భూముల లైసెన్స్ కూడా 2027 లోపల గడువు పూర్తి కావస్తున్నందున రైతులు ప్రభుత్వంతో పోరాడి వాటిని పునరుద్ధరించుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న రైతు రామానుజం

హైకోర్టుకు వెళ్లాల్సిందే..

లీగల్ అడ్వయిడర్ అన్నయ్యశర్మ మాట్లాడుతూ ప్రభుత్వం లాండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ గైడ్‌లైన్స్‌ను విడుదల చేసిందని, దాని ప్రకారం లీజులు రద్దు చేసి వేరే వారికి భూములు వేలం ఎందుకు వేయకూడదనే విషయమై పలు అంశాలను ఇచ్చారని తెలిపారు. 2014 తరువాత భూముల వేలం అనే అంశం ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. దాని దృష్ట్యా రైతులు సాల్ట్ కమిషనర్ దృష్టికి రిఫరెన్స్ రూపంలో ఉప్పు రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని దరఖాస్తు చేసుకొని, అక్కడ నుంచి అంగీకార పత్రం తీసుకొని తద్వారా ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని సూచించారు. ఆపై హైకోర్టుకు వెళ్లి రైతుల వాదన వినిపిస్తే న్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన సలహా ఇచ్చారు. కార్యక్రమంలో ఉప్పు లైసెన్స్‌దారులు, ఉప్పు రైతులు వలివేటి రామానుజం, చినగంజాం సొసైటీ ప్రెసిడెంట్ బొడ్డు ఏడుకొండలురెడ్డి, రాజు బంగారుపాలెం సొసైటీ ప్రెసిడెంట్ పెల్లేటి రమణారెడ్డి, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, తుమ్మలపెంట సీతయ్య, బీవీ రమణారెడ్డి, కందేపి సతీష్, వలివేటి బాలాజీ, తోట నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సహజ సాహితీ సంస్థ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న గ్రహీతలు

చీరాల అర్బన్: సాహితీ, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభావంతులను పురస్కారాలతో గౌరవించుకోవడం బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ సహజ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాభారతి కాకరపర్తి వెంకటేశ్వర్లు పేరిట ఏర్పాటు చేసిన వేదికపై పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి కోడూరి ఏకాంబరేశ్వరబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా బండారుపల్లి హేమంత్‌కుమార్, పోలుదాసు రామకృష్ణ, అంగలకుర్తి నాగవీరభద్రాచారి, చందలూరి బాలవెంకటేశ్వరరావు హాజరయ్యారు. పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన రచయితలు, కళాకారులు బత్తుల బ్రహ్మారెడ్డి, నూనె అంకమ్మరావు, కోసూరి రత్నం, గాడేపల్లి దివాకర్ దత్తు, డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, భాగి కృష్ణమూర్తి, ఆసోది అక్కిరెడ్డి, కొణతం వెంకటరమణారెడ్డి, వడలి రాధాకృష్ణకు సహజ సాహితీ స్ఫూర్తి పురస్కారాలు అందించారు. వెన్నెలగంటి సీతారామాంజనేయశర్మ, ఆవుల దయాకర్‌రెడ్డి, కొసనం నాగమాంబ, జూటూరి సీతారామశాస్త్రి, మంత్రి కృష్ణమోహన్, పవని భానుచంద్రమూర్తి పాల్గొన్నారు.

జాతి ప్రయోజనాల కోసమే పార్టీలకు మద్దతు

ఆత్మీయ సమ్మేళనంలో మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

తెనాలి రూరల్: జాతి ప్రయోజనాల కోసమే తాను ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలకు మద్దతిచ్చానని, ఏ నిర్ణయమైన మన బిడ్డల భవిష్యత్తు కోసమే అని విశ్వసించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. తెనాలి సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాదిగల ఆత్మగౌరవ ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి వేడుకగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో జాతి స్వప్నం సాకారం అయ్యిందన్నారు. ఈ పోరాటంలో కొంత మంది ప్రాణాలు వదిలారని, ఈ తీర్పు వారికే అంకితమని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా, కాంగ్రెస్‌లోని మాల నాయకులు కొందరు అడ్డుకున్నారని ఆరోపించారు. తీర్పు ఫలితాలు అందితేనే పోరాటానికి సార్థకత చేకూరుతుందని అన్నారు. రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ (ఆడిట్) పులపాక ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎనిమిది శాతం ఉన్న మాదిగలు రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బుదాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మాదిగలు విద్యా సంస్థలు ఏర్పాటు చేసి పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, బిషప్ సురేష్ కుమార్, ప్రముఖ న్యాయవాది మట్టా జయకర్, ప్రొఫెసర్ పొన్నెకంటి రత్నాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మున్నంగి నాగరాజు, రుత్రపోగు సురేష్, విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి, బాపట్ల ఆర్డీవో గంధం రవీంద్ర, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిలుమూరి శ్రీనివాసరావు, ఆలపాటి కరుణ తదితరులు మాట్లాడారు. ఆహ్వాన కమిటీ సభ్యులు పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్, సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, హైకోర్టు న్యాయవాది మేకల రవికుమార్, అత్తోట శ్యామ్, అత్తోట శరత్, బీజేఆర్ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. వివరాలు.. కొల్లిపర మండలం సిరిపురం గ్రామానికి చెందిన అత్తోట వసంతలక్ష్మి (33) మొదటి భర్తతో విడిపోయి తెనాలి నాజరుపేటకు చెందిన వడ్డే కరీమ్ పృథ్వీని రెండో వివాహం చేసుకుంది. వీరికి ఆగస్ట్ 29న మగబిడ్డ పుట్టాడు. ఈ నెల 13న తలకు తీవ్ర గాయంతో తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందింది. రెండు రోజులకు తల నొప్పి రావడంతో గుంటూరు జీజీహెచ్‌లో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివాహమై ఏడాదే కావడంతో శవ పంచనామా నిర్వహించాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను వన్‌టౌన్ పోలీసులు కోరారు. ఆదివారం గుంటూరు వైద్యశాలలోని మార్చురీకి వెళ్లిన తహసీల్దార్ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల బాలుడు మృతి

- కన్నీరుమున్నీరుగా విలపించిన కన్నవారు
- పారిశుద్ధ్య లోపమే కారణమని ఆరోపణలు



మంగళగిరి: అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఐదు సంవత్సరాల బాలుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పాత మంగళగిరిలో నివాసముంటున్న ఊట్ల వేణు, శివపార్వతిల కుమారుడు ద్వారకా కృష్ణ. శనివారం సాయంత్రం 5 గంటల వరకు హుషారుగా ఆడుకున్నాడు. ఏడు గంటల ప్రాంతంలో చిన్నపాటి జ్వరం రాగా.. తల్లిదండ్రులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాలుడి పరిస్థితి విషమంగా ఉందన్నారు. దీంతో విజయవాడ రెయిన్ బో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. తల్లితండ్రులు విషాదంలో కూరుకుపోయారు. స్థానికులు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. దోమకాటుతో విషజ్వరం కారణంగా బాలుడు మృతి చెందాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

లక్ష్మీపురం: పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరెండర్ లీవ్ బిల్లులు 2022 నుంచి ఇప్పటి వరకు క్రెడిట్ కాలేదని, ఏపీజీఎల్ఐ లోన్, ఫైనల్ పేమెంట్స్, చాలా కాలం నుండి బకాయిలు ఉన్నాయని, పీఎఫ్ లోన్, ఫైనల్ పేమెంట్స్ కూడా గత మార్చి నుంచి జమ కాలేదని అన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు కూడా చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎ.ఐ.ఎస్.టి.ఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రాథమిక విద్య మనుగడకు ప్రశ్నార్థకమైన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని, ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మధ్యమాన్ని కొనసాగించాలని, శాశ్వత బదిలీ కోడ్ రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు కె.జోజప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు ఏ.వి.ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు డి.వి.సుబ్బారావు, వై శ్యాంబాబు, కె. సద్గుణరావు, ఎండీ సాలార్ బేగ్, మధుబాబు, జి.మిధున్, హనుమంత ప్రసాద్, మస్తాన్‌రావు, ఏడుకొండలు, పి.ప్రసాద్, పి. దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జాషువా పద్యాల్లో నవరసాలు



డాక్టర్ గరికపాటి గురజాడను సత్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సామాజిక అధికార కవి జాషువా అని కేంద్రీయ విశ్వవిద్యాలయం (అనంతపురం జిల్లా) తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ గరికపాటి గురజాడ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జాషువా పద్యానికి పట్టాభిషేకం అంశంపై సభ జరిగింది. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ గరికపాటి గురజాడను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా పద్యాల్లో నవరసాలు ఉంటాయని ప్రశంసించారు. జాషువా సున్నితమైన మనస్కుడని, అదే ఆ కవికి ఉన్న గొప్ప లక్షణమని అన్నారు. ప్రపంచంలోని ప్రతి వస్తువులో భగవంతుడిని చూశారని తెలిపారు. కన్నతల్లిని ప్రేమించిన వాడే సమాజాన్ని ప్రేమిస్తారని స్పష్టం చేశారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. గుర్రం జాషువా సమాజ కవి అని అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఎంజేఎస్ఎస్ అధ్యక్షుడు పినపాటి మోహన రావు, ప్రముఖ న్యాయవాది గద్దం ఎలీషా, కవి, నాటక ప్రయోక్త డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సాహితీ పరిశోధకులు పారా అశోక్, అత్తోట జోసెఫ్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వర రావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఆదివారం జూనియర్స్ విభాగంలో పల్నాడు, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి గిత్తలు పోటీల్లో పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన డి. రోహన్‌బాబు గిత్తలు 2,523.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు, యరమల మోక్ష అదరన్ గిత్తలు 2481.4 అడుగులు లాగి ద్వితీయ స్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబుకు చెందిన మరి కొన్ని గిత్తలు, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి గిత్తలు సమానంగా 2,408.1 అడుగుల లాగి తృతీయ స్థానం సాధించాయి. వీరికి కమిటీ సభ్యులు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేశారు.